సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 29 । మే । 2023



ఘనంగా మోదమ్మ ఉత్సవాలు
పెదబయలులో మోదకొండమ్మ తల్లి మూడు రోజుల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 8లో



చివరి మజిలీకి సగౌరవంగా..
కేజీహెచ్‌లో ఏడు మహా ప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో పది వాహనాలను సమకూర్చనుంది. 8లో



తీరంలో నాట్య మయూరి
విశాఖ రుషికొండ తీరంలో సీతమ్మధారకు చెందిన తేజశ్రీ కూచిపూడి నృత్యం ప్రాక్టీస్ చేస్తూ అలరించిన దృశ్యాన్ని సాక్షి క్లిక్ చేసింది.

న్యూస్‌రీల్

3,975 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు



వ్యవసాయశాఖ ఏడీ సావిత్రి

అడ్డతీగల: సబ్ డివిజనల్ పరిధిలోని నాలుగు మండలాలకు 3,975 క్వింటాళ్ల వరి వితనాలు అవసరమని ఏపీ సీడ్స్‌కు ప్రతిపాదనలు పంపినట్టు వ్యవసాయశాఖ ఏడీ కంకిపాటి సావిత్రి తెలిపారు. వీటిలో ఆర్జీఎల్–532, ఎంటీయూ1064, ఎస్ఎల్ఆర్3449, ఎంటీయూ1156, బీపీటీ5204, ఎంటీయూ1061 రకాలు ఉన్నాయన్నారు. అడ్డతీగల మండలానికి 1,147 క్వింటాళ్లు, గంగవరం 1,150 క్వింటాళ్లు, రాజవొమ్మంగి 1,197 క్వింటాళ్లు, వై.రామవరం 481 క్వింటాళ్ల చొప్పున విత్తనాలు కేటాయించామని పేర్కొన్నారు. జూన్ మొదటి వారంలోగా రైతుభరోసా కేంద్రాలకు విత్తనాలు వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. వీటిని 90 శాతం రాయితీపై అందజేస్తామని చెప్పారు.

అగ్ని బాధితులకు వసతి సౌకర్యం
- సొంత నిధులతో షెడ్ల నిర్మాణం
- అండగా ఎంపీ మాధవి, భర్త శివప్రసాద్



తాటిమానిపాలెంలో షెడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న శివప్రసాద్

కొయ్యూరు: అగ్ని బాధితులకు ఇచ్చిన మాటను అరకు ఎంపీ మాధవి, ఆమె భర్త శివప్రసాద్ నిలుపుకున్నారు. మండలంలోని అంతాడ పంచాయతీ తాటిమానిపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు కాలిపోవడంతో ఏడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. అప్పటిలో బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎంపీ మాధవి భర్త శివప్రసాద్ నివాసం ఉండేందుకు గాను సొంత నిధులతో రేకుల షెడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.2 లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న రేకుల షెడ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. త్వరలోనే బాధితులు వాటిలో నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ చంద్రరావు పాల్గొన్నారు.

పాడేరు మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి చిత్రపటాన్ని స్వామిజీకి అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, పాడేరులోని మోదకొండమ్మతల్లిని పాకలపాడు ఆశ్రమం గురుదేవులు రామానందస్వామిజీ ఆదివారం దర్శించుకున్నారు.ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మోదమ్మకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయంలో తన భక్త బృందం,శిష్యులతో సమావేశమయ్యారు. ఆలయ ఉద్యోగి కొట్టగుళ్లి రామారావు, ఇతర ప్రతినిధులు స్వామిజీని సత్కరించారు. మోదమ్మ చిత్రపటం, ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రతినిధి మత్స్యరాస మత్స్యరాజు, స్వామిజీ శిష్యులు, ,ఏబీవీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పైనాపిల్ అమ్మకాలు ప్రారంభం



వంట్లమామిడిలో పైనాపిల్ పండ్లు

సాక్షి,పాడేరు : ఏజెన్సీలో పైనాపిల్ దిగుబడులు ప్రారంభమయ్యాయి. గత ఐదు రోజుల నుంచి పాడేరు మండలంలోని సలుగు, దేవాపురం పంచాయతీల పరిధిలోనిగిరిజనులు పైనాపిల్ పండ్లను సేకరించి విక్రయిస్తున్నారు. పాడేరు ఘాట్‌లోని 12వ మైలురాయి జంక్షన్, ఆదివారం వంట్లమామిడి సంతలోను పండ్ల అమ్మకాలు జరిగాయి. పైనాపిల్ సైజును బట్టి రూ.30నుంచి రూ.40 ధర పలికింది.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..
- టెన్త్ సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక బోధన తరగతులు
- సద్వినియోగం చేసుకుంటున్న 4,168 మంది విద్యార్థులు



పాడేరు శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక శిబిరంలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

సాక్షి,పాడేరు: జిల్లాలో పదో తరగతి పరీక్ష తప్పిన విద్యార్థులంతా సప్లిమెంటరీ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణులయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 4,168 మంది హాజరవుతున్నారు. ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల విద్యాలయాలకు చెందిన వీరికి అన్ని వసతులతో కూడి ప్రత్యేక బోధన తరగతులు విజయవంతంగా జరుగుతున్నాయి. ఆయా సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను, విద్యా,గిరిజన సంక్షేమశాఖ అధికారులతో వీటిని నిర్వహిస్తున్నారు. ఉదయం పాఠ్యాంశాల బోధన, మధ్యాహ్నం పరీక్షల నిర్వహణ, సాయంత్రం నుంచి చదివించే పనుల్లో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. జిల్లాలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏల పరిధిలోని సుమారు 20 వరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో ప్రత్యేక బోధన తరగతులు జరుగుతున్నాయి. ఈనెల 12వ తేదీనుంచి ఇవి ప్రారంభమయ్యాయి.

ఎంతో ఉపయోగం



టెన్త్‌లో సైన్స్,గణితంలో తక్కువ మార్కులు రావడంతో ఫెయిలయ్యాను. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక బోధన తరగతులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సప్లిమెంటరీ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం ఏర్పడింది.

– అర్లాబు సాయి, టెన్త్ విద్యార్థిని, వనుగుపల్లి, పాడేరు మండలం

పాసవుతుందని నమ్మకం



టెన్త్ పరీక్షల్లో ఇంగ్లీషు సబ్జెక్టులో నా కుమార్తె తప్పింది. ఇప్పుడు మళ్లీ పరీక్ష రాస్తోంది. ప్రత్యేక బోధన తరగతుల వల్ల పరీక్ష పాస్ అవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఇంటర్‌తోపాటు పైచదువులు చదివించాలనే ఆశయంతో ఉన్నాను.

– పాంగి సోయిత, విద్యార్థిని తల్లి, గబ్బంగి, పాడేరు మండలం

విజయవంతంగా బోధన



సప్లిమెంటరీ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఆశయం మేరకు ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా బాలబాలికలకు వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది.

– సలీమ్‌బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, పాడేరు

వివాహ వేడుకలో అపశ్రుతి
- తారాజువ్వలు పడి తాటాకిల్లు దగ్ధం
- సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం



పూర్తిగా కాలిపోయిన సంపరి ముసిలి తాటాకుల ఇళ్లు



మంటలు వ్యాపించి కాలిపోతున్న కళ్యాణ మండపం

కొయ్యూరు: వివాహ వేడుకలో అపశ్రుతి చోటుచేసుకుంది. బాణసంచా కాల్పుల్లో భాగంగా తారాజువ్వ పడి తాటాకిల్లు బూడిదయ్యింది. చిట్టింపాడులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇదే గ్రామంలో శనివారం రాత్రి జుర్రా రమణబాబుకు వివాహం జరిగింది. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు. ఈ సమయంలో తారాజువ్వలు సంపరి ముసిలి ఇంటిపై పడ్డాయి. తాటాకిల్లు కావడంతో మంటలు చెలరేగాయి. రాత్రి సమయం కావడంతో ఎంత ప్రయత్నించినా అదుపుచేయలేకపోయారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి పక్కనే ఉన్న కల్యాణ మండపంపై పడింది. పెద్ద శబ్దం రావడంతోపాటు మంటలు చెలరేగడంతో వివాహానికి వచ్చిన వారంతా భయంతో పరుగులు తీశారు. స్థానికులు చొరవ తీసుకుని మంటలను అదుపు చేశారు. వివాహానికి వచ్చిన బంధువులు ముసిలి ఇంట్లో ఉంచిన వస్తువులు, రూ.40 వేల నగదు, వంటపాత్రలు కాలిపోయాయి. నష్టం రూ.3 లక్షల మేర ఉంటుందని అంచనా. రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు పేర్కొన్నారు.

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు



పోచవరం బోట్ పాయింట్ వద్ద పర్యాటకుల రద్దీ

వీఆర్‌పురం: పాపికొండలు విహారానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.పోచవరం బోట్ పాయింట్ నుంచి ఆదివారం 526 మంది తొమ్మిది బోట్లలో తరలివెళ్లారని ఏపీ టూరిజమ్ ఇన్‌చార్జి మేనేజర్ సీహెచ్ రాజేష్ తెలిపారు. పర్యాటకుల తాకిడితో పోచవరం బోట్ పాయింట్ ,పేరంటపల్లి శివాలయం ,కొల్లూరు హట్స్‌వద్ద సందడి నెలకొంది.

పోసమ్మగండి నుంచి 406 మంది

దేవీపట్నం: గోదావరి నదిపై పాపికొండలు విహారానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివెళ్లారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న 406 మంది పర్యాటకులు రాజమహేంద్రవరం నుంచి పలు వాహనాల్లో పోశమ్మగండికి చేరుకున్నారు. ఏడు బోట్లపై నిబంధనలు, లైఫ్ జాకెట్లు ధరించి పేరంటపల్లికి తరలివెళ్లారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



రంపచోడవరంలో వలంటీర్లను పురస్కారాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- పురస్కారాలతో సత్కారం

రంపచోడవరం: ప్రభుత్వ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో వలంటీర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ వద్ద వలంటీర్లకు నిర్వహించిన వందనం కార్యక్రమంలో నామె పాల్గొన్నారు. వలంటీర్లకు శాలువా కప్పి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలన్నీ ప్రజల వద్దకే నేరుగా అందుతున్నాయన్నారు. ఒకటో తారీఖు రాగానే అవ్వ ,తాతలకు నేరుగా ఇంటివద్దకు వెళ్లి పింఛను అందజేస్తున్నారన్నారు. వారు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఏటా పురస్కారాలు అందజేస్తూ సత్కరిస్తోందన్నారు. మండలంలో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర కింద 239 మంది వలంటీర్లకు పురస్కారాలు ఇవ్వడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని రకాల పౌర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం
- వ్యక్తి అరెస్టు

మోతుగూడెం: ఒడిశా ప్రాంతం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తులను డొంకరాయి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కలిమెల నుంచి డొంకరాయికి అక్రమంగా మద్యం తీసుకువస్తున్నట్టు సమాచారం మేరకు పోలీసులు నిఘా ఏర్పాటుచేశారు. దీనిలో భాగంగా మద్యం బాటిళ్లను తీసుకువస్తున్న డొంకరాయికి చెందిన అడంగి ధర్మారావును అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

గురుకుల ఉపాధ్యాయుల బదిలీలకు ఉత్తర్వులు

కంచరపాలెం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లోని ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ లెక్చరర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు, ట్రైనీ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు, స్పెషల్ టీచర్స్ (వ్యాయామ ఉపాధ్యాయులు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, హెల్త్ సూపర్‌వైజర్లు), సీనియర్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఈ నెల 30, 31వ తేదీల్లో విశాఖ జిల్లా మేఘాద్రిగెడ్డ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులు పీజీకి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్‌కి హాజరుకావాలని ఆమె కోరారు.

బదిలీలపై ముమ్మర కసరత్తు..!
- ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలు విడుదల
- 17 దరఖాస్తుల తిరస్కరణ
- స్పౌజ్, మెడికల్ సర్టిఫికెట్లపై మరోదఫా పరిశీలన
- తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే క్రిమినల్ చర్యలు
- 6,071 దరఖాస్తులకు ఆమోదం



విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీలపై విద్యాశాఖాధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వివిధ కేడర్లకు చెందిన 6,088 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలన మేరకు 17 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.లక్ష్మణరావు ఆదివారం వెల్లడించారు. దీంతో 6,071 దరఖాస్తులకు ఆమోదం లభించింది. కొంతమంది దరఖాస్తులను ఉపసంహరించుకోగా, మరికొంతమంది ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని వాటిని తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. కొన్ని కేడర్లకు సంబంధించిన ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను ఆదివారం ప్రకటించారు. సోమవారం నాటికి పూర్తి స్థాయిలో అన్ని కేడర్ల సీనియార్టీ జాబితాలు ప్రదర్శించేలా విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

ఎస్.రాయవరం నుంచి అత్యధికం

ఉపాధ్యాయులకు మేలు చేయాలనే ఉద్దేశంతో జీరో సర్వీసుతో బదిలీకి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువగానే దరఖాస్తులు వచ్చాయి. సొంత గ్రామాలు, వాటికి సమీప పాఠశాలల్లో చోటు దక్కించుకోవడం కోసం ఉపాధ్యాయులు ఆసక్తి కనబరుస్తున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం నుంచి అత్యధికంగా 258 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత స్థానంలో నక్కపల్లి మండలం నుంచి 251 దరఖాస్తులు అందాయి. కాగా విశాఖపట్నం అర్బన్ నుంచి అత్యల్పంగా కేవలం 16 మంది మాత్రమే బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా పెదగంట్యాడ మండలం నుంచి 58, గాజువాక – 71, సబ్బవరం – 78, పెందుర్తి – 82 మంది దరఖాస్తు చేసుకున్నారు. విశాఖపట్నం నగరానికి సమీపాన ఉండడంతో ఇక్కడి నుంచి వేరేచోటకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి కనబరచలేదు.

తప్పిదాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలపై ఈ నెల 30న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలు పరిశీలించి, వాటిని పరిష్కరిస్తారు. ఈ ప్రక్రియే కీలకం కానుంది. ఈ ఏడాది జనవరిలో బదిలీల ప్రక్రియ నిర్వహించగా, కోర్టు కేసుల కారణాలతో దానిని రద్దు చేశారు. అయితే ఆ సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 మంది ఉపాధ్యాయులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు తేలింది. స్పౌజ్, మెడికల్ సర్టిఫికెట్లు సమగ్ర పరిశీలనతో ఇది వెలుగులోకి వచ్చింది. ఇలాంటి వాటిని కట్టడి చేసే క్రమంలోనే ఈ సారి బదిలీల ఉత్తర్వుల్లోనే స్పష్టమైన విధి విధానాలను ఉన్నతాధికారులు వెల్లడించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టిన వారికి మూడు ఇంక్రిమెంట్లు కోత పెట్టడటంతోపాటు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసారి ఎంతమంది అయ్యవార్లు అడ్డదారులు తొక్కారనేది అభ్యంతరాల పరిశీలన అనంతరం తేలనుంది.

1,997 మందికి కంపల్సరీ బదిలీ

ఒకే చోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న హెచ్‌ఎం, 8 ఏళ్లు పూర్తయిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో గ్రేడ్ – 2 హెచ్‌ఎం – 105 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు – 1,394 మంది, స్కూల్ అసిస్టెంట్లు – 498 మంది ఉన్నట్లు లెక్క తేల్చారు. వీరంతా ప్రస్తుతం పనిచేస్తున్న చోట నుంచి తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే.

మన్యంలో గాలివాన బీభత్సం

జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు ఇళ్లు, విద్యుత్ లైన్లు, రోడ్డుకడ్డంగా కూలిపోయాయి. విద్యుత్‌లైన్లు దెబ్బతినడంతో పలు గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. రాజవొమ్మంగి ప్రాంతంలో వడగళ్ల వాన కురిసింది. జనజీవనం స్తంభించింది.



కొయ్యూరులో కుండపోతగా కురుస్తున్న వర్షం



బలమానుశంకలో ఈదురగాలులకు దెబ్బతిన్న ఇల్లు



తోటపల్లిలో విరిగి పడిన విద్యుత్ స్తంభం



రాజవొమ్మంగిలో వడగళ్లు

కొయ్యూరు: మండలంలో ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపడంతో ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులతో వానకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొయ్యూరు సంతకు వచ్చిన వారు వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యాపారుల వస్తువులు తడచిపోవడంతో కొంతమేర నష్టం వాటిల్లింది.

దెబ్బతిన్న రేకుల ఇళ్లు

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో వర్షం కురిసింది. వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. సింగర్భ పంచాయతీ నిట్టాపుట్టు, రచ్చపల్లి గ్రామాల్లో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.గెమ్మెలి పంచాయతీ బలమానుశంకలో ఈదురుగాలులతో కూడిన వానకు కురిడే లక్ష్మయ్య, పండ్లి బాలరాజు, సెగ్గె లక్ష్మయ్యకు రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్టు బాధితులు తెలిపారు.

ఎటపాక: గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ముమ్మిడివరం, తోటపల్లి, కాపవరం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో పలుగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంలో ఉన్నాయి. నల్లకుంట ప్రధాన రహదారిపై తాటి చెట్టు పడిపోయింది. గన్నేరుకొయ్యపాడులో ఓ ఇంటిపై కొబ్బరి చెట్టి విరిగి పడింది.

పిడుగుపాటుకు ఆవుల మృతి



మృతిచెందిన ఆవులు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ తట్టువలస గ్రామానికి చెందిన గరిడిపల్లి రాముకు చెందిన రెండు ఆవులు పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మేతకు వెళ్లిన ఆవులు అదే సమయంలో గ్రామ సమీపంలోని చెట్టుకిందకు చేరాయి. వీటికి సమీపంలోని పిడుగు పడటంతో రెండు ఆవులు ప్రాణాలు కోల్పోయాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు రాము ప్రభుత్వాన్ని కోరాడు.

రాజవొమ్మంగిలో వడగళ్ల వాన

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండిపోతుండగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ఆహ్లాదకర చల్లని వాతావరణం నెలకొంది. ఎడతెరిపి లేకుండా వడగళ్లతో కూడిన వర్షం కురిసింది.

పిడుగుపాటుతో ఇద్దరికి అస్వస్థత



మాట కోల్పోయిన కిముడు లక్ష్మి



అస్వస్థతకు గురైన కిముడు మణి

సీలేరు: దుప్పులవాడ పంచాయతీ పెద్ద అగ్రహారంలో పిడుగుపాటుకు ఇద్దరి గిరిజన మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తులు వారిని సీలేరు ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో కిముడు లక్ష్మి, కిముడు మణి బయట కూర్చొన్నారు. ఇంతలో ఒక్కసారిగా పిడుగు పడటంతో వారు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని బంధువులు 108లో సీలేరు ఆస్పత్రికి తీసుకువచ్చారు. కిముడు లక్ష్మి మాట కోల్పోయినట్టు వైద్యాధికారి షేక్ మస్తాన్ వల్లీ తెలిపారు.

శివప్రసాద్‌రెడ్డిపై ఫిర్యాదు

టీచర్సు రోడ్డు(విశాఖ): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అగౌరవపరుస్తూ సిరిపురం సర్కిల్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన జనసేన నాయకుడు శివప్రసాద్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ 28వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బి.భవానిశంకర్ మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఆదివారం చేశారు. దివంగతి నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎంపీ వివేకానందరెడ్డి మృతిని కించపరిచేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని కోరారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్


డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్(విశాఖ) : రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. విద్యార్థులు వారి సమీప హెల్ప్‌లైన్ కేంద్రంలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. జిల్లాకు సంబంధించి కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కౌన్సెలింగ్ ద్వారా సీటు పొంది, అర్హత కలిగిన వారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల ద్వారా ఉచితంగా చదివిస్తుందని తెలిపారు.

ఐసీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్‌గా కృష్ణమాచారి


చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న కార్యవర్గ సభ్యులు

విశాఖ విద్య: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ సీఎంఏ పి.బి. కృష్ణమాచారి ఎన్నికయ్యారు. విశాఖపట్నం చాప్టర్ భవనంలో ఆదివారం ఐసీఏఐ కార్యవర్గ 58 సంవత్సరాంతపు సమావేశం జరిగింది. విశాఖపట్నం చాప్టర్ కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించారు. చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సీఎంఏ పి.బి.కృష్ణమాచారి, వైస్ చైర్మన్‌గా సీఎంఏ ఏయు.లక్ష్మణరావు, కార్యదర్శిగా జి.రామలింగారెడ్డి, కోశాధికారిగా ఎం.హిమబిందును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా బి.సంపత్‌బాబు, వి.శాంతిశిరీష, బి.నరేంద్ర, ఎం.వెంకటేష్, ఎస్.రాజశేఖర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ 2023–24 సంవత్సరానికి పాలకవర్గంగా వ్యవహరించనుందని కార్యదర్శి సీఎంఏ రామలింగారెడ్డి తెలిపారు.

సివిల్స్ ప్రిలిమ్స్‌కు 51.28 శాతం హాజరు

సీతంపేట: సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరి పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 29 కేంద్రాలలో రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 10,864 మంది అభ్యర్థులకు గాను మొదటి సెషన్ పరీక్షకు 5,607 మంది, రెండో సెషన్ పరీక్షకు 5,536 మంది హాజరయ్యారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. మొత్తంగా రెండు సెషన్లకు 51.28 శాతం పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులతో కలిసి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిబంధనలు, ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేసారు.

చివరి మజిలీకి సగౌరవంగా..

విశేషంగా మహాప్రస్థానం సేవలు

బతుకు ఎలా ఉన్నా.. చావు హీనం కారాదు. కాయం కాటికి చేర్చేందుకు భారమవరాదు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందే వారి భౌతిక కాయాలను తరలిస్తున్న మహాప్రస్థానం వాహనాల సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. మృతుల కుటుంబ సభ్యులు రూపాయి చెల్లించకుండా ఈ సేవలు పొందే అవకాశం ఉంది. మృతదేహాలను గౌరవప్రదంగా ఆయా కుటుంబ సభ్యులకు అప్పగించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన దిగ్విజయంగా అమలు జరుగుతోంది. కేజీహెచ్‌లో ఈ సేవలు నిరంతరం అందుతున్నాయి.



విశాఖపట్నం డెస్క్ : కేజీహెచ్‌లో రోజూ చికిత్స పొందుతూ, ప్రమాదాల బారినపడి కనీసం పది నుంచి ఇరవై మంది వరకు చనిపోతుంటారు. వీరి మృతదేహాలను మహా ప్రస్థానం వాహనాల్లో తరలిస్తుంటారు. నగర పరిధిలో అయితే గంట నుంచి రెండు గంటలు సమయం పడుతుంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే రోజుకు ఒక మృతదేహాన్ని మాత్రమే తరలించడం సాధ్యపడుతుంది. ప్రస్తుతం ఉన్న ఏడు మహా ప్రస్థానం వాహనాలు సరిపోవట్లేదు. అదనపు వాహనాల కోసం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కసరత్తు చేశారు. హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలుకు టెండర్లు పిలిచారు. దీంతో కేజీహెచ్‌కు మరో పది మహా ప్రస్థానం వాహనాలు సమకూరనున్నాయి. ప్రస్తుతం గిరిజన ప్రాంతాలకు మృతదేహాల తరలింపునకు కేజీహెచ్ అధికారులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో 100 కిలోమీటర్ల వరకు అని నిబంధన ఉండేది.. ఇప్పుడు ఎక్కడికైనా.. ఎంత దూరమైనా ఉచితంగా మృతదేహాలను తరలిస్తున్నారు.

మృతదేహాలకూ హక్కులుంటాయ్!

చనిపోయిన వ్యక్తుల హక్కుల గురించి దేశంలో ప్రత్యేకమైన చట్టాలు లేవు. రాజ్యాంగంలోని ఆర్టికల్–21 ప్రకారం మృతదేహాలకు కూడా మానవ హక్కులు వర్తిస్తాయని ఆయా సందర్భాల్లో కోర్టులు తీర్పులిచ్చాయి. 1989 నాటి ప్రేమానంద్ కటారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు ఇలాగే తీర్పిచ్చింది. ఆ తరువాత అలహాబాద్ హైకోర్టు, మద్రాస్ హైకోర్టు, తెలంగాణ హైకోర్టులు కూడా ఆయా సందర్భాల్లో మృత దేహాల హక్కులు కాపాడాలంటూ ఆదేశించాయి. ప్రధానంగా కోవిడ్ సెకండ్ వేవ్ సమయంలో మృతదేహాల హక్కుల మీద చర్చ జరిగింది. చనిపోయిన వారిని తరలించడానికి అంబులెన్సులు దొరకకపోవడం, శ్మశానాల్లో ఖాళీ లేకపోవడం, గంగానదిలో శవాలు తేలడం వంటి సంఘటనల మధ్య మృతదేహాల హక్కులు కాపాడాలంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జారీ చేసిన మార్గదర్శకాలు

- కుటుంబ సభ్యులు అడిగితే మృతదేహాన్ని తరలించేందుకు స్థానిక అధికారులు రవాణా సౌకర్యం కల్పించాలి.
- బంధువులకు మృతదేహాన్ని గౌరవంగా అప్పగించాలి.
- మతృదేహాల విషయంలో మతం, కులం, ప్రాంతం, లింగ వివక్ష చూపరాదు.

ఉచిత సేవలు ఎలా పొందాలి?

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల ప్రాంగణంలో మహాప్రస్థానం వాహనాలుంటాయి. సేవలు అవసరమైనప్పుడు వార్డు ఇన్‌చార్జికి సమాచారం ఇస్తే వారు మహాప్రస్థానం వాహనాలను రప్పిస్తారు. కేజీహెచ్‌లో ఈ వాహనాలు గతంలో భావనగర్ వార్డు పక్కన ఉండేవి. పలువురి విన్నపం మేరకు ప్రస్తుతం మార్చురీ వద్ద ఉంచుతున్నారు. సత్యసాయి ట్రస్ట్‌కు చెందిన మహాప్రస్థానం వాహనం కోసం ట్రస్ట్ కోఆర్డినేటర్‌కు 9885129654 ఫోన్ చేయాలి.

ప్రైవేట్ ఆస్పత్రిలో చనిపోతే?

ప్రైవేట్ ఆస్పత్రిలో చనిపోతే మహాప్రస్థానం వాహనాల సేవలు అందవు. వారు ప్రైవేట్ అంబులెన్సుల్ని ఆశ్రయించాల్సిందే. ప్రైవేట్ అంబులెన్సుల నిర్వాహకులు నగర పరిధిలో అయితే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, గ్రామీణ జిల్లాకు అయితే దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

కేజీహెచ్ నుంచి తరలించిన మృతదేహాలు

నెల	సంఖ్య	నెల	సంఖ్య
జనవరి	380	మార్చి	410
ఫిబ్రవరి	400	ఏప్రిల్	428

మహాప్రస్థానం వాహనాల సంఖ్య **6** | సత్యసాయి ట్రస్ట్ వాహనం **1**

రోజుకు తరలించే మృతదేహాలు **10 నుంచి 15**

నెలలో తరలించేవి **300 నుంచి 400**

సేవలు లభించకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి?

మహాప్రస్థానం వాహనాల సేవలు పూర్తిగా ఉచితం. ఎవరైనా డబ్బు డిమాండ్ చేసినా మృత దేహాన్ని తరలించడానికి నిరాకరించినా సంబంధిత ఆస్పత్రి సూపరింటెండెంట్/జిల్లా కలెక్టర్/జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయవచ్చు. కేజీహెచ్ సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవకు 92466 71226 నెంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

దరఖాస్తు చేస్తే కేటాయింపు



మహా ప్రస్థానం వాహనాలు కావాల్సిన వారు సీఎస్ఆర్ఎంవోను సంప్రదించాలి. పూర్తి వివరాలతో దరఖాస్తు పూర్తిచేసి కార్యాలయంలో అందజేయాలి. దరఖాస్తు పరిశీలించిన తరువాత మహాప్రస్థానం వాహనాలను కేటాయిస్తాం. ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ వాసుదేవ, సీఎస్ఆర్ఎంవో, కేజీహెచ్

దేవుడు కల్పించిన అవకాశం



రాత్రి పగలు అనేది లేకుండా ఎప్పుడైనా ఎక్కడికైనా వెళ్లాం. కొన్నిసార్లు ఏజెన్సీ ప్రాంతాల్లో మారుమూల ప్రాంతాలకు, రహదారుల కూడా సరిగా లేనిప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మృతుల బంధువుల తోడు తీసుకుంటాను. అయినా అది నాకు పెద్ద కష్టం అనిపించదు. ఎందుకంటే కుటుంబంలో ఓ వ్యక్తిని కోల్పోయి బాధలో ఉన్నవారికి సహాయం చేయడం బాధ్యతగా అనిపిస్తోంది. ఇది దేవుడు నాకు కల్పించిన అవకాశంగా భావిస్తాను.

– కోరాడ స్వామి, మహా ప్రస్థానం వాహనం డ్రైవర్

ఉత్తరాంధ్ర అంతా వెళ్తాం..



ఒక వాహనంలో నగర పరిధిలో అయితే రోజుకు 3 నుంచి 4 మృతదేహాలను తరలిస్తుంటారు. ఏజెన్సీలో అయితే వెళ్లొచ్చేసరికి సమయం పడుతోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధ రాత్రి సమయంలో చనిపోతే మృతదేహాలను ఫ్రిజర్‌లో పెట్టి ఉదయం పంపిస్తుంటాం. కిలోమీటర్ల నిబంధనలు ఏమి లేకుండా ఉత్తరాంధ్రలో అన్ని ప్రాంతాలకు మృతదేహాలను తరలిస్తుంటాం. అనాథ శవాలను నిబంధనల మేరకు జ్ఞానాపురం శ్మశానవాటికకు తరలిస్తుంటాం.

– రొంగలి పైడయ్య, మహాప్రస్థానం లైజనింగ్ ఆఫీసర్

ఘనంగా మోదమ్మ ఉత్సవాలు


ఉత్సవ విగ్రహాన్ని ఎత్తుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తదితరులు

- పెదబయలులో ప్రారంభం
- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు

పెదబయలు: వనదేవత పెదబయలు మోదకొండమ్మ తల్లి మూడు రోజుల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు ఘటాలను ఆలయం నుంచి శతకంపట్టు వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి కొలువుదీర్చారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు ఉత్సవాలను ప్రారంభించారు. ఊరేగింపులో అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను మోసేందుకు మహిళలు, భక్తులు పోటీపడ్డారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు 150 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టాయి. జి. మాడుగుల సీఐ సత్యానారాయణ,పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జల్లిపల్లి నర్సింహమూర్తి, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీపీ వరహాలమ్మ, ఎంపీటీసీ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వర్తక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


పెదబయలులో తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్

ఆటోను ఢీ కొట్టిన ఆవు


చేతికి గాయమైన చిన్నమ్మి


భార్య నాగమణి మృతదేహం వద్ద రోధిస్తున్న భర్త చంద్రరావు

- ఆటో బోల్తా పడి ఆశ కార్యకర్త మృతి
- వివాహ విందుకు హాజరై వెళ్తుండగా ప్రమాదం
- బూదరాళ్లలో విషాదం

కొయ్యూరు : మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో చెప్పలేమన్నది నిజమైంది. ఆమె తోటి వారితో కలిసి వివాహ విందుకు హాజరైంది. తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా మృత్యువు ఆవు రూపంలో వచ్చింది. దీంతో బూదరాళ్లలో విషాదం నెలకొంది. బూదరాళ్ల ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న కూనిశెట్టి నాగమణి(42) ఆదివారం మర్రివాడ పంచాయతీ దొడ్డవరంలో నిర్వహించిన వివాహ విందుకు హాజరై, తిరిగి బూదరాళ్లకు ప్రయణమైంది. మర్రివాడకు సమీపంలో ఆటోలో వెళ్తుండగా అటు నుంచి వేగంగా వస్తున్న ఆవు ఆటోను బలంగా ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్ ఆటోను నియంత్రించేందుకు ప్రయత్నించినా ఫలితం లేక బోల్తా పడింది. ఆటో చివరన కూర్చున్న నాగమణిపై ఆటో మొత్తం పడిపోయింది. దీంతో ఆమె గుండె వద్ద బలంగా గాయమై అక్కడే ఆమె కుప్పకూలిపోయింది. వెంటనే 108లో రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్టుగా వైద్య సిబ్బంది నిర్ధారించారు.

భార్య మరణించిన సమాచారం భర్త చంద్రరావుకు తెలియడంతో ఆయన భార్య మృతదేహంపై పడి బోరున విలపించారు. నాగమణికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. వారంతా చదువుతున్నారు. అందరికీ సేవలు అందించే నాగమణి ఇక లేరన్న విషయం తెలుసుకున్న బూదరాళ్ల గ్రామస్తులు కంటతడి పెడుతున్నారు. ప్రమాదంలో ఓనంగి చిన్నమ్ములు చేతికి గాయమైంది. పాత్తూరు రాజుబాబు, ఇలపు సింహాద్రికి స్వల్ప గాయాలయ్యాయి.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చోడవరం రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం సీజ్ చేసినట్టు చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు చెప్పారు. జన్నవరం రహదారిలో బెన్నవోలు జంక్షన్ వద్ద తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా గౌరీపట్నం గ్రామానికి చెందిన కోన సురేష్ ఎటువంటి అనుమతులు లేకుండా బెన్నవోలు నుంచి జన్నవరం వైపు ట్రాక్టర్‌పై ఇసుకలోడు తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని చోడవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అదే విధంగా గౌరీపట్నం గ్రామానికి చెందిన బొబ్బిలి సంతోష్ ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు.

కాశీపురం జంక్షన్ వద్ద...

దేవరాపల్లి : శారదానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కాశీపురం జంక్షన్ వద్ద తమ సిబ్బందితో కలిసి దాడి చేయగా ఇసుక లోడుతో రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయన్నారు. వీటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

భారతదేశం విజ్ఞానాల నిధి

కొమ్మాది : భారతదేశం విజ్ఞానాల నిధి అని కేంద్ర విదేశీ వ్యవహారాల ఇన్‌చార్జి డా.విజయ్ చౌతైవాలె అన్నారు. బీచ్ రోడ్డులో గల రాడిసన్ బ్లూలో రెండు రోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ ఆవిష్కరణ సృజనాత్మక సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. కోవిడ్ మహమ్మారికి వ్యాక్సిన్ కనుక్కోవడం, యూపీఐ (యునిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) లావాదేవీల వల్ల ప్రపంచంలో మేటి దేశంగా భారతదేశం నిలిచిందన్నారు. భారతీయ ఆవిష్కరణలను ఆయన విపులంగా వివరించారు. స్థానిక పరిష్కారాలను గ్లోబల్ సొల్యూషన్స్‌గా మార్చడానికి స్కేలింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఐఎస్ఎస్‌పి అధ్యక్షుడు అసుతోష్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక స్వభావాన్ని పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. అప్పుడే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించగలమన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూఎఫ్ఈ వ్యవస్థాపకురాలు డా.రూపావాసుదేవన్, చైర్మన్ భరత్ లాల్‌మీనా తదితరులు పాల్గొన్నారు.

ఓపీ.. హ్యాపీ

- కేజీహెచ్, విక్టోరియా, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో ఈవెనింగ్ ఓపీ
- రోగులకు సంతృప్తికర సేవలు
- వివిధ పరీక్షల రిపోర్టులు అదే యూనిట్ వైద్యుల పరిశీలన


పేదల ఆరోగ్యప్రదాయిని కేజీహెచ్

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రిలో ఇప్పుడు ఈవెనింగ్ అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం ఓపీ టికెట్ తీసుకుని, వైద్యులకు చూపించే సరికి ఒక పూట గడిచిపోతుంది. వైద్యుల సూచన మేరకు వివిధ పరీక్షలు చేయించుకునే సరికి మధ్యాహ్నం అవుతుంది. దాంతో సంబంధిత వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. మళ్లీ అదే యూనిట్ ఓపీ వచ్చే సరికి వారం రోజులు పడుతుంది. ఇంతలో రోగం ముదిరిపోయి పరిస్థితులు దిగజారిపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం సాయంత్రం ఓపీ సేవలను అందుబాటులోకి తేవడం తమకెంతో మేలు చేస్తుందని పేదలంటున్నారు. ఉదయం ఏ యూనిట్ ఓపీ నిర్వహిస్తుందో.. సాయంత్రం కూడా అదే యూనిట్ వైద్యులు ఓపీ సేవలకు అందుబాటులో ఉంటున్నారు. ఈ నెల 17 నుంచి ఈ సేవలను అమలులోకి తెచ్చింది. గైనిక్, డెర్మటాలజీ, మెడిసిన్, సర్జన్స్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్ విభాగాల ఓపీలు ఈ సేవలందిస్తాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. ఇటీవల అమరావతిలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమాల్లో ఈవినింగ్ క్లినిక్స్ ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. ఈ ప్రకారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బోధనాస్పత్రుల్లో అమలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ ఘోష ఆస్పత్రిలో..

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ ఘోష (విక్టోరియా) ఆస్పత్రిలో కూడా సాయంత్రం వేళ ఓపీ సేవలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది ఓపీ సేవలందిస్తున్నారు. సిబ్బందికి డ్యూటీల్లో మార్పులు చేశారు. ప్రతి రోజు విజిహెచ్‌లో జరిగే ఓపిల్లో వైద్యులు రాసిన వివిధ పరీక్ష రిపోర్ట్సును సాయంత్రం ఓపీ సమయంలో వైద్యులు పరిశీలించి మందులు రాయడానికి వీలు కలుగుతుంది. ఉదయం ఓపీలను, పాత ఓపీ టికెట్ కలిగిన వారికి మాత్రమే సాయంత్రం పూట వైద్యం అందిస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషారాణి తెలిపారు. ఈ ఆస్పత్రికి గర్భిణులు,బాలింతల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఆస్పత్రిలో 250 పడకలు ఉన్నాయి. రోజూ ఒపికి 125 నుంచి 150 వరకు బాలింతలు,గర్భిణులు వస్తుంటారు. బుధవారం, శుక్రవారం రోజుల్లో రోజుకు 300 నుంచి 400 వరకు వస్తున్నారు.

ప్రభుత్వ నేత్ర వైద్యశాలలో..

రామాటాకీస్ రోడ్డుని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఈవెనింగ్ ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఆ రోజు ఏ యూనిట్ వైద్యులు ఉంటారో అదే యూనిట్ వైద్యులు సాయంత్రం ఓపీ సేవలు అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయింది



ద్విచక్రవాహనం మీద వెళ్తున్న నన్ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడమ కాలు విరిగిపోయింది. ప్రమాదం జరిగిన కొద్ది రోజుల తర్వాత కేజీహెచ్ వైద్యులను సంప్రదించాను. వారు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇప్పుడు రాడ్డు తొలగించవలసి ఉంది. దాని కోసం ఈ రోజు ఈవెనింగ్ ఓపీకి వచ్చాను. వైద్యులు బాగా చూశారు.

–కిల్లో మోహనరావు, తలబిరడ, ముంచంగిపుట్టు మండలం, ఏఎస్ఆర్ జిల్లా

గాయమైతే చూపించా..



రెండున్నరేళ్ల నా కుమారుడు జస్వంత్ రోడ్డు మీద పడిపోయాడు. చేయి వాచిపోయింది. వైద్యులకు చూపించాను. ఎక్స్‌రే రాశారు. సాయంత్రం ఓపీలో చూపించడానికి వచ్చాను. కట్టు కట్టాలని చెప్పారు. ఒడిశా నుంచి చుట్టం చూపునకు వచ్చిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

– చంటిబాబు, ఒడిశా